# ప్రహరీ గోడ అడ్డు..అవస్థల గోడు

- ప్రజల రాకపోకలకు అడ్డుగా ప్రహరీ గోడ
- మూడు కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి
- శివరాంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో బీఆర్ఎస్ నాయకుల ఆందోళన


శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో అడ్డుగా నిర్మించిన ప్రహరీ గోడను తొలగించాలని నిరసన వ్యక్తం చేస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 25: ప్రజల రాకపోకలకు ఇబ్బందికలిగేలా ప్రహరీ గోడను నిర్మించి అవస్థలకు గురి చేస్తున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు. ఆదివారం శుభోదయం మైలార్‌దేవ్‌పల్లి కార్యక్రమంలో భాగంగా శివరాంపల్లి రైల్వే స్టేషన్ బాబుల్‌రెడ్డినగర్ నివాసులు, బీఆర్ఎస్ నాయకులు భారీ ఎత్తున రైల్వే గేట్‌కు అడ్డంగా కూర్చొని ప్రహరీ గోడను తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ బాబుల్‌రెడ్డినగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు అనేక మంది ఈ దారి గుండానే వెళ్తుంటారు. పాఠశాలలకు, కళాశాలలకు, ఉద్యోగాలకు ఇలా ప్రతిదానికి ఈ దారిపైనే ఆధారపడి ఉంటారన్నారు. అయితే ఈ రహదారి మూసివేయడంతో కాలనీ వాసులు , స్కూల్ పిల్లలు వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం అవుతుందన్నారు. అదేవిధంగా గర్భిణులు అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తుందన్నారు. పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిలకు వినతిపత్రాలు సమర్పించినా ఏ ఒక్కరూ స్పందించడం లేదన్నారు. దీంతో సమస్యను పరిష్కరించడంలో విఫలం కావడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలమంతా కలిసి ఆందోళనకు దిగామన్నారు. వెంటనే స్పందించి ఈ గోడను కూల్చివేసి గతంలో ఉన్న మాదిరిగా ప్రజల రాకపోకలు నిర్వహించేలా చూడాలన్నారు. లేనిపక్షంలో మరింత భారీ ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాముయాదవ్, రఘుయాదవ్, సోమ శ్రీనివాస్, భగవాన్‌దాస్, అరుణ్‌ముదిరాజ్, సురేష్, కొంపల్లి జగదీష్, చిరంజీవి, వెంకటరమణ, రాజు, అశోక్, సునీల్, రాజు, రత్నం, కురుమయ్య, సంతోష్, లక్ష్మణ్, రాజు, లక్ష్మీ, సరిత, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



## అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

అతివేగంగా వచ్చిన కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆదివారం తెల్లవారుజామున జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45 నుంచి వస్తున్న కారు (టీఎస్ 09ఈజెడ్ 2844) రోడ్డు నంబర్ 1 వైపునకు టర్నింగ్ తీసుకునే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం ధ్వంసం అయింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. అతివేగంతో రావడంవల్లనే కారు అదుపుతప్పిందని పోలీసులు గుర్తించారు. – బంజారాహిల్స్, మే 25:

## నేడు కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ, మే 25 : కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ కోరారు. నేడు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో నేడు ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి యథావిధిగా ప్రారంభమవుతుందని, ప్రజలు స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించుకోవాలని జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు గంగాధర్, వంశీకృష్ణ కోరారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

దుండిగల్, మే 25 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బహదూర్ పల్లిలోని ప్రణీత్ ఫ్లోరా కాలనీ వాసుల ఆహ్వానం మేరకు కాలనీలో ఎమ్మెల్సీ ఆదివారం పర్యటించారు. స్థానికుల ద్వారా కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు.

# పొదుపే బంగారు భవిష్యత్‌కు బాట


శ్రీ గాయత్రీ పొదుపు సంఘం వార్షికోత్సవం పాల్గొన్న సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 25: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శకాలనీ శ్రీ గాయత్రీ పొదుపు సంఘం 25వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భావన రుషి ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఏర్వ కుమారస్వామి జమ ఖర్చుల పట్టిక, ఆదాయ–వ్యయాల వివరాలు, ఆస్తులు, బాధ్యతలపై పూర్తి నివేదికను చదివి వినిపించారు. అధ్యక్షుడు శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు విషయాలపై చర్చించి ఆమోదాలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఏర్వ కుమారస్వామిలు మాట్లాడుతూ ఈ సంఘం 2000లో కేవలం నలుగురు సభ్యులతో ప్రారంభమై గత 25 సంవత్సరాల్లో 640 మంది సభ్యులతో బలమైన సంస్థగా ఎదిగిందన్నారు. 60 ఏళ్లు నిండిన సభ్యులకు వడ్డీతో పాటు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్నామన్నారు. పొదుపే బంగారు భవిష్యత్తుకు పునాది అనే నినాదంతో సంఘం ముందుకు సాగుతుందన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక...

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆదర్శ కాలనీలోని శ్రీ గాయత్రీ పొదుపు సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎదిరే శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా దశపతి భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా ఏర్వ కుమారస్వామి, సహాయ కార్యదర్శిగా దశపతి రాజు, గాజుల సురేష్, కోశాధికారిగా గుర్రం తిరుపతమ్మ, సభ్యులుగా అదెట్ల బాలరాజ్, అదెట్ల నరేష్, గంజి రాజేశ్వరి, సగ్గం మహేందర్, ముదిగొండ సత్యనారాయణ, కూడికల ప్రభాకర్, మేకల సాయికిశోర్, వర్కాల శ్రీశైలం, మసిని వనజలను ఎన్నుకున్నారు.



## వర్సిటీ బోధనేతర సంఘం అధ్యక్షుడు రాజుకు సన్మానం

రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ బోధనేతర సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన రాజును ఆదివారం కిస్మత్పూర్‌లోని ఎస్ఈఆర్‌పీ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. దేవాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు యువకులు పాల్గొని అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన రాజును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పాటుపడే గొప్ప వ్యక్తిగా రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు అనంతయ్య, భగవాన్ దాస్ తదితరులు పాల్గొన్నారు. – బండ్లగూడ, మే 25:



# వరదలా...డ్రైనేజీ

### పోయేదెట్లా..వచ్చేదెట్లా
### చలనం లేని అధికారులు, ప్రజాప్రతినిధులు
### ఫిర్యాదులు చేసినా కరువైన స్పందన

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పొంగి పొర్లుతున్న డ్రైనేజీలతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు డ్రైనేజీలు వరదలై పారుతున్నాయి.ఇలాంటి డ్రైనేజీల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు అనేక మార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓయాసిస్ అపార్ట్‌మెంట్ నుంచి శ్రీ ఎన్‌క్లేవ్,లోనేట విల్లాస్,కావూరిహిల్స్ తదితర కాలనీలకు వెళ్లే దారిలో డ్రైనేజీలు పొంగుతున్నాయి. అంతే కాకుండా ప్రజలు అంటువ్యాధుల భారీన పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు..సమస్యలను పరిష్కరించడంలో అధికారులు శ్రద్ధ చూపడంలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. – బండ్లగూడ, మే 25

## విశ్రాంత ఉద్యోగుల పింఛన్ పెంచాలి

అంబర్‌పేట, మే 25 : స్టేట్ బ్యాంక్ అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ సమావేశం ఆదివారం స్థానికంగా జరిగింది. అసోసియేషన్ ప్రతినిధి ఉప్పు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో 1995 నుండి పింఛను పెంపు, భీమా సౌకర్యం తదితర అంశాలపై చర్చించారు. కేంద్ర ప్రభు త్వం వెంటనే ఈ విషయాలపై స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రధాన కార్యదర్శి సి.ఎన్. ప్రసా ద్, అధ్యక్షుడు డా.అనంతకృష్ణ, సంయుక్త ప్రధాన కార్యదర్శి వి.సోంబాబు తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి కె. రోహిణిరావు, లక్ష్మారెడ్డి, కృష్ణమురళీ, ములినిరెడ్డి, రవికుమార్, రామకోటేశ్వర్ రావు, సాయిరెడ్డి, వి.కె. తివారి తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు కేంద్రం కృషి


హిమాయత్ నగర్ ,మే 25: ఉగ్రవాదంను సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భద్రతకు కేంద్రం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఆపరేషన్ సిందూర్ తో దేశ ప్రజల్లో ఆత్మస్థైర్యం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎన్.వీ. సుభాష్, నవీన్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ప్రణవ భక్త సమాజం శతాబ్ది ఉత్సవాలు



ప్రణవ భక్త సమాజం శతాబ్ది ఉత్సవాల్లో స్వామిజీలను సన్మానిస్తున్న సమాజం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 25: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో ప్రణవ భక్త సమాజం ఏకశత పంచోత్తర మహోత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఆదివారం ఉదయం పూర్ణాహుతి, గణపతి సహిత రుద్రహోమం, మహాత్ముల దివ్య ప్రవచనాలు నిర్వహించారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. నిత్యాన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరి రోజు ఆదివారం పరిశుద్ధానందగిరి స్వామి, శంకరానందగిరి స్వామి, వీరానంద బ్రహ్మాచారి దివ్య ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సమాజం అధ్యక్షులు మొండ్ర నర్సింహ, పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, కొండమీది హరినాథ్, ఎస్.బి.హరినాథ్, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, కొలన్‌సుభాష్‌రెడ్డి, మ్యాడం రామేశ్వర్‌రావు, మొండ్ర కొమురయ్య, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు రాజ్‌భూపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ స్తంభానికి మంటలు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని క్రిష్ణారెడ్డి కాలనీలో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభానికి ఒక్క సారిగా మంటలు చెలరేగాయి.ఇది గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులతో పాటు ఫైర్‌ఇంజన్‌కు సమాచారం అందించారు. వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఫైర్ ఇంజన్ అక్కడకి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ స్తంభానికి భారీ స్థాయిలో కేబుల్ కనెక్షన్లు ఉండటం వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చని ప్రజలు భావిస్తున్నారు.– బండ్లగూడ,మే 25

# బడిబయట బడీడు పిల్లలు ఉండకుండా..

- జూన్ 6 నుంచి 19 వరకు బడి బాట..
- సర్కారు బడుల్లో సౌకర్యాలపై విస్తృత ప్రచారం
- ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు కార్యాచరణ సిద్ధం




జూబ్లీహిల్స్, మే 25: ప్రభుత్వ పాఠశాలల్లో జూన్ 6 నుంచి 19 వరకు 'బడిబాట' కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యనందించేందుకు ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం పూర్తి చేశారు. ఈ విద్యా సంవత్సరం (2025–26) లో అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ఎప్పటిలాగే జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభంకానున్న నేపథ్యంలో బడి బాట కార్యక్రమం ముమ్మరంగా చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

బడి బాట కార్యక్రమంలో భాగంగా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలతో, ఎన్‌జీఓలు, వలంటీర్లతో కలిసి ఉపాధ్యాయులు బస్తీల బాట పట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనంతో పాటు ప్రధానంగా నాణ్యమైన విద్యపై విస్తృతంగా ప్రచారం చేయనున్నారు.

### బస్తీలు, కాలనీల్లో క్యాంపెయిన్లు

*– శ్రవణ్ కుమార్, డిప్యూటీ ఐఓఎస్.. ఖైరతాబాద్–2*

ఈ ఏడాది బడిబాట కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. 1 నుంచి 5 తరగతులలో అడ్మిషన్లు భర్తీ చేసేందుకు ఉపాధ్యాయ బృందాలు పాఠశాల చుట్టుపక్కల ఉన్న బస్తీలు, కాలనీల్లో ర్యాలీలు, క్యాంపెయిన్లు నిర్వహిస్తారు. సర్కారు బడుల్లో అందుతున్న సౌకర్యాలపై ప్రచారం నిర్వహిస్తారు. బడికి దూరంగా వున్న పిల్లలను గుర్తించి స్థానిక పాఠశాలలో అప్పటికప్పుడు అడ్మిషన్లు ఇస్తాం. అందరికీ విద్య అందించే లక్ష్యంతో బడి బయట పిల్లలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

## విద్యాభివృద్ధికి సింగరేణి సహకారం

సికింద్రాబాద్, మే 25: వందేళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఉస్మానియా యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో తరగతి గదుల నిర్మాణానికి సహకరించడం తమ సంస్థకు ఎంతో గర్వకారణంగా ఉందని సింగరేణి సీఎండీ బలరామ్ పేర్కొన్నారు. తెలంగాణలో విద్యా రంగాన్ని ఆధునికీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సింగరేణి సంస్థ తెలంగాణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి తనవంతు సహకారాన్ని ఎప్పుడూ అందిస్తూ వస్తోందని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ శాఖలో దాదా పు రెండు కోట్ల రూపాయల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన తరగతి గదుల కాంప్లెక్సను యూనివర్సిటీ ఉప కులపతి కుమార్ మొలుగారంతో కలిసి ఆయన ప్రారంభించారు.

# ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులు


వీనస్‌రాక్స్ హైట్స్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, మే 25 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కాలనీలు, బస్తీలను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని వీనస్‌రాక్స్ హైట్స్‌లో రూ. 36.80 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే వివేకానంద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించామని, రానున్న రోజుల్లో కూడా అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ బాయ్, చెట్ల వెంకటేశ్, తెలంగాణ సాయి, చిన్నా చౌదరి, సమ్మయ్య యాదవ్, బాబీ చౌదరి, దూలప్ప, శివా నాయక్, జునైద్, ఆసిఫ్, ప్రసాద్, వీనస్ రాక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వీసీ. వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీధర్ రెడ్డి, సలహాదారులు శివరాం ప్రసాద్, శంకర్ రెడ్డి, మధు, సంయుక్త కార్యదర్శి బాల నాగ దుర్గా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### మత్స్య సహకార సంఘం అభివృద్ధికి సహకారం

కుత్బుల్లాపూర్ : మత్స్య సహకార సంఘం అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హామీ ఇచ్చారు. ఆదివారం 132 – జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలోని ఎఫ్‌సీఎస్ కన్వెన్షన్‌లోనిర్వహించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, జీడిమెట్ల శాఖ 5వ సర్వసభ్య సమావేశానికి బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎ మ్మెల్యే మాట్లాడుతూ.. చెరువులకు జీవం పోస్తూ మత్స్యకార వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు ఆర్థికాభివృద్ధిని అందించి, మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి కృషిచేసిన గొప్ప నాయకుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ ఫిషరీస్ కో– ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డిస్ట్రిక్ ఫిషరీస్ ఆఫీసర్ సుకీర్తి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జీడిమెట్ల శాఖ అధ్యక్షుడు చిలుకూరి కృష్ణ, ఉపాధ్యక్షురాలు చిలుకూరి యాదమ్మ, ప్రధాన కార్యదర్శి మద్దూరి వీరేశ్, డైరెక్టర్లు తాళ్ల వెంకటేశ్, మన్నె శంకర్, అరికల లక్ష్మణ్, మద్దూరి సత్తెమ్మ, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


ఉప్పల్ మినీ శిల్పారామంలో చిన్నారుల కూచిపూడి నృత్యం

రామంతాపూర్, మే 25: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం గురువు పావని శ్రీలత ప్రసాద్ శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. రంగ పూజ, విన్నపాలు, పుష్పాంజలి, ఇదిగో భద్రాద్రి, శాంకరి శంకరుడు, నమశ్శివాయ, హిమగిరి, రామాయణ శబ్దం తదితర అంశాలను విముక్త, సుహాని, నిద్విక, శాన్వి, చైత్ర, జెశ్విత, దేవి లత, మాధవి, ఆద్య, తరుణి, అడవిత, సమన్విత, హంసిని ప్రదర్శించి ఆహుతులను మెప్పించారు.

## ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం


వరద నీటి కాలువ పనులపై అధికారులు, కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్, మే 25 : ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడుతున్నట్లు మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరద కాలువల నిర్మాణంతో పటేల్ చెరువుకు అనుసంధానించి ఉపశమనం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పటేల్ కుంట చెరువు సమీపంలో నూతనంగా నిర్మించబోయే కాలువ నిర్మాణ పనులపై అధికారులు, కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఇప్పటికే వరద నీటి కాలువల నిర్మాణాలను ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. తద్వారా మురుగునీరు చెరువులలోకి చేరకుండా నివారించి, వర్షపు నీటితో చెరువులు కళకళ లాడేలా చర్యలు చేపడతామన్నారు. వర్షాకాలం లోగా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వీటిని అందుబాటులోకి తేవాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


ఆదివారం సదర్శకులతో కళ కళ లాడుతున్న జూపార్క్


ఎంక్లోజర్ వద్ద ఖడ్గ మృగాన్ని తిలకిస్తున్న పర్యాటకులు

## జూ పార్క్‌కుకు పోటెత్తిన సందర్శకులు

జంతు ప్రదర్శన శాల (జూ పార్క్) ఆదివారం సందర్శకులతో కళ కళలాడింది. వేసవి సెలవులు కావడంతో ఆహ్లాదపు వాతావరణాన్ని ఆస్వాదించడానికి భారీగా సందర్శకులు జూపార్క్‌నకు తరలి వచ్చారని అధికారులు తెలిపారు. దీనితో జూ లోని జంతువుల ఎంక్లోజర్‌లు పర్యాటకులతో నిండిపోయాయి. ఆదివారం సుమారు 24వేల పైచిలుకు పర్యాటకులు జూను సందర్శించారని అధికారులు తెలిపారు. – చార్మినార్, మే 25: